# పాముకాటు

ఊళ్ళో మాసూళ్ళు ఇంకా పూర్తికాలేదు. పెదనాన్నగారి కబురందుకొని కాలేజీకి సెలవు పెట్టి బస్సులో వచ్చాను. కాని మరుసటి రాత్రే ఈ ఘోరం జరిగింది

*   *   *

బహుళ దశమి. పులి పంజాలాంటి ధనుర్మాసం చలి. అసుర సంధ్యతోనే పురులు విచ్చుకున్న చీకటి. ఆకసంలో సిగ్గుతో బిక్కు బిక్కుమని తొంగిచూస్తున్న నక్షత్ర కన్యలు దూరాన రైలు కట్టమీద మెయిల్ బండి కూసిన రాక్షసి అరుపుకు ఉలిక్కిపడినట్లు ఒక్కసారి మినుక్కు మన్నవి.

అప్పుడే భోజనం చేసి వచ్చిన పెద్దనాన్నగారు బారు అరుగుమీద పచార్లు చేస్తూ జైమిని వచన భారతం పఠిస్తున్నారు. మహాభారత యుద్ధానికి నాందిగా కౌరవ, పాండవులు సమకూర్చుకుంటున్న అశేష సైన్య బలాబలాలను వర్ణిస్తున్న ఘట్టం అది. పెదనాన్నగారి మధుర .గంభీర స్వరం నుండి గంగా ఝరివలె వెలువడుతున్న వచనగీతాలు కురుక్షేత్రంలో యుగాంతానికి చరమగీతం ఆలపించనున్న పద్దెనిమిది అక్షౌహిణుల రణవ్యూహాన్ని కళ్ళముందు సాక్షాత్కరింపజేస్తున్నవి. శరీరం గగుర్పొడిచి నేను నిశ్చేష్టుడనై నిలబడి ఆలకిస్తున్నాను.

పల్లెవేపు నుంచి చీకట్లో చీకటిగా వచ్చిన జియ్యరుదాసు కఱ్ఱపోటుమీద అల్లంత దూరంలో నిలబడి ఉండటం ఎవరూ గమనించలేదు. చెరువు గట్టుమీది తుమ్మలగుంపు నుంచి అసందర్భంగా, అకస్మాత్తుగా వినబడ్డ గుడ్లగూబ ఆక్రందనం విని జియ్యరుదాసు ఉలిక్కిపడి పెద్దగా దగ్గాడు. అప్పుడే అతన్ని గమనించిన పెదనాన్నగారు "ఏమిటి దాసూ, చీకట్లో?" అన్నారు. జియ్యరు కఱ్ఱ కొద్దిగా కంపించినట్టయింది.

"కుప్ప కొడితే మంచిదయ్యగోరూ?"

"మురుగునీరు తీసిందా?"

"బూమి కూసెంత తడిగా ఉందిగాని పూరా నీరు లేదయ్యా!"

''మరి వరికళ్ళం పడదు గదా?"

"రోడ్డు మోయిన ఏస్తామయ్యా!"

"ఏమంత తొందర? నాలుగు రోజులుంటే పోలా?"

దాసు మాట్లాడకుండా నిలబడ్డాడు. సమాధానం ఇవ్వటానికి గొంతుకేదో అడ్డం పడినట్లుగా తటపటాయిస్తున్నాడు.

''ఏమిటా అనుమానం దాసూ?"

"అనుమానంగానే ఉందది అయ్యగోరూ! నిన్న రేత్తిరి కుప్పలకాడ మడుసులు మసులుతుంటే యానాది తిరిపాలు చూశాడయ్యా!"

''మనుషులా! ఎవరోయ్?'' పెదనాన్నగారు 'అరేయ్, ఉరేయ్' అని ఎవరినీ సంబోధించరు.

''ఇంకోళ్ళు ఇంకోళ్ళు ఎవురొస్తారయ్యా? మునసబు బావమరిది మడుసులేనండయ్యా!....''

పది నిమిషాలు మౌనసముద్రంలో ఉండి పెదనాన్నగారొక నిట్టూర్పు విడిచారు. ఆ నిశ్శబ్దంలో అది అందరికీ వినిపించినట్టయింది.

''సరే ఎల్లుండి త్రయోదశి. ఆదివారం ప్రారంభిద్దాం. రేపే బండ్ల వాళ్ళకు చెప్పు. మీ మనుషుల్ని కూడా పురమాయించు."

కాని జియ్యరుదాసు భయాలే నిజ స్వరూపం దాల్చి ఆ మరునాడు ఏకాదశినాడే పెదనాన్నగారి పది పుట్ల వరికుప్ప పడమటి పొలంలో బూడిదై పోయింది.

* * *

రెండుతరాల బస్తీ జీవిత పరిధిలో ఇమిడిపోయి, గ్రామీణ వాసాన్ని ప్రశాంత ప్రకృతితోనూ, నిష్కపట హృదయులైన జానపదుల ఒడిదుడుకులులేని నిశ్చల జీవనానందంతోనూ ఊహించి కల్పనా సాహిత్య సాగరాన్ని మథిస్తున్న నాకు ఈ భూస్వామ్య కఠిన పాషాణ దుర్గపు నిజ స్వరూపం మొదటిసారిగా ప్రత్యక్షమైనప్పుడు నిస్పృహాందోళనలతో సతమతమవుతూ ఆ దినమల్లా గడిపాను. ఆర్యనాగరికతలో వృత్తిరీత్యా రూపొందిన కులప్రాతిపదిక మ్లేచ్ఛులా, ఆంగ్లేయులూ బలపరిచిన భూస్వామ్య విషజాలంతో రాక్షస శక్తిగా అవతరించి నేడు

దానిని ఎదిరించిన వారినెల్లా హింసించగలుగుతున్నదా? కాలేజి గోడలమీద ఉగ్రవాద విద్యార్థి ఉద్యమం ప్రబోధిస్తున్న తుపాకిగుళ్ళ శక్తేనా ఈ నరరూప హంతకులకు ఎదురు నిల్చేది? మహాత్ములు, మునులు నీతిశాస్త్రాలు వేద వేదాంగాలు - వీటికి వారసులమని చెప్పుకునే పుణ్యభూమి, కర్మభూమి నేడు హింసా దౌర్జన్యాల ప్రవృత్తినే ఎందుకెన్నుకున్నది? వేలాది సంవత్సరాల వేదాంతం, నాగరికత ఎక్కడ దాక్కున్నవి?

కాని, పెదనాన్నగారు నిరామయంగా ఉన్నారు. ఆ రాత్రి తగులబడిన కుప్పను చూచి, వచ్చి మరునాడు ఆదివారం ఉదయానే యథాతథంగా లోక బాంధవుడికి అర్ఘ్యమిచ్చి, ఆదిత్య హృదయం పఠించి అరుగుమీద ఆసీనులై అభినవ సహదేవుల వలె ముందున్న విశాలమైన ప్రాంగణంలో గుంపులుగా ఉన్న వ్యాధిగ్రస్త పశువుల్ని పరీక్షిస్తున్నారు. కామందులకు మందుల గురించి సలహాలు చెబుతున్నారు. ఇంకో పక్క పురుగు కాటుకు శరీరం మీద పొడలు గట్టి, నీర నించి, శుష్కవదనాలతో నిలబడి కూర్చుని ఉన్న స్త్రీ పురుష బాలబాలికల్ని పరీక్షించి మిరియాలు మంత్రించి కొత్త తెల్లగుడ్డ పేలికతో దురాయిలు కట్టి పంపిస్తున్నారు. మహాయోగిగానూ, సిద్ధపురుషుడుగానూ గోచరిస్తున్న ఆయన మూర్తికి నమస్కరించనివాళ్ళు లేరు - కొందరు మనస్సులలోనూ, కొందరు బహిరంగంగానూ.

*　　　*　　　*

అప్పటికే హరిజనవాడలో సగం మంది గ్రామ పెదలు ఇంటిముంగిట ఖాళీజాగాలో గుమికూడి ఉన్నారు. పది పన్నెండుమంది రైతు పెద్దలు మాత్రం రెండవ అరుగుమీద కూర్చుని ఉన్నారు.

జియ్యరుదాసూ, రామజోగి, మతం పుచ్చుకున్న అతని కొడుకులు ఫిలిప్పు, యాకోబు, లూకాయి ముందు వరసలో అస్తిమితంగా కూలబడి వాళ్ళ వెనకనే కొందరు కుర్రకారు నిలబడీ, చతికిలబడి గుంపులుగా ఉన్నారు. ఒక్క జియ్యరుదాసు తప్పితే అందరి చేతుల్లోనూ కర్రలూ, బడితెలూ, వన కొయ్యలూ ఉన్నాయి. వాళ్ళ పక్కనే ఇంకో గుంపు. కుమ్మర్లు, ముత్రాసులు. కుంకపుదాసులు, దూదేకుల మస్తాను, ఊళ్ళో ఎవరికీ భయపడక ఎదురు నిలిచే ముత్రాసు నారాయుడు తలపాగ విప్పి, నడుముకూ మోకాలికీ ముడివేసి చుట్ట కాల్చబోయి. తిరిగి ఆపి చెవిలో దోపుకుంటూ, తను మాట్లాడేందుకు ఎప్పుడు అవకాశం వస్తుందా అని అస్థిరుడై కళ్లు మండించుకుంటూ అక్కడే ఉన్నాడు.

దొమ్మీ జరగబోయే ముందు క్షణిక కాల శాంతివలె ఆ నిశ్శబ్దం. పశుకామందులతో పెదనాన్నగారి మృదుభాషణ ఒక్కటే దానికి భంగం. అంతేనా? ఇంకో కొద్ది నిమిషాల్లో ఈ గ్రామం రణరంగం కాబోతున్నదా? అగ్ని, వాయువు మిత్రులై తమ ఆకలికై మారణ యజ్ఞానికి ఆయత్తమౌతున్నారా? నిష్కృతి లేని విద్వేష కార్పణ్య జ్వాలల్లో ఈ గ్రామం తన భవిష్యత్తును బూడిదలో కలపనున్నదా?

పశువులు, వాటి కామందులు తిరోన్ముఖులు అవుతూండగానే పెద్ద రైతులు తమ సానుభూతిని మాటలతో ప్రకటించలేక ఒకరి వెంట ఒకరు అనుసరించి పోతుండగా పదకొండు గంటలు దాటింది. కాని, పేద లెవ్వరూ లేవలేదు. రైతులు దాటిపోతుండగా వాళ్ళవంక కొరకొర చూస్తూ చుట్టూ నిండి ఉన్న అస్థిరతకు ఒక రూపం ఇస్తున్నట్లున్నది వాళ్ళ వాలకం. పెదనాన్నగారు చేతులు కడుక్కొని ఉత్తరీయానికి తుడుచుకుంటూ లేవబోతుండగా అశ్వనీ దేవతల రాయబారివలె రంగాచార్లు గారు వచ్చి "సంజీవరాయుడుగారూ! మీ వంటి మహా పురుషులకే ఇంత ఘోరకలి తలపెడితే గ్రామంలో మాబోంట్ల గతి ఏమవుతుంది?" అని అప్పటిదాకా హిమగిరి వలె చలించని నిశ్శబ్దాన్ని ఛేదించారు.

అదనుకోసం వేచి ఉన్న ముత్రాసు నారాయుడు దిగ్గున లేచి "అద్గదే. ఆ సంగతే తేల్చుకుందామని కూకుండాం. ఆసార్లు బాబూ, పెద్దాయన నోట్నుండి మాట వస్తే గందండీ మేం పూనుకొనేది?" అని తీక్షణంగా చూశాడు. హరిజన వాడ కుర్రకారంతా ముందుకు తోసుకుని వస్తున్నారు. మిలిటరీలో పనిచేసి వచ్చిన దానియేలు చేతులూపుతూ, ఊగిపోతూ అరిచాడు- "అయ్యగారు 'ఊఁ' అనాలే గాని ఇనుమంటి లచ్చి నారాయుల్ని పది మందిని ఖతం చేస్తాం."

పెదనాన్నగారి వరికుప్ప తగుల బెట్టించిన వ్యక్తి లక్ష్మీనారాయణే అని ఊళ్ళో పసి పిల్లలవరకూ తెలిసిపోయిందన్నమాట!

జియ్యారుదాసు ముందుకు వచ్చి దానియేల్ని వెనక్కి తోశాడు. అతడు శాంతంగానే వ్యవహారాన్ని కదిలించాడు. "ఇది ఊరా - అడివా అయ్యగారూ? సంజీవయ్యగారు నాయం కోసం నిలబడి చెరువుకింది పోరంబోకు భూమి పట్టా గట్టించి మా కిప్పించినందుకే గందండి యీ లచ్మిన్నారాయుడు పగబట్టింది?

ఇంత గోర కలి జేసినా అల్ల కులపోళ్ల పల్లెత్తి మాటన్నారా బాబులూ? మళ్ళీ జూడబోతే పెద్ద పెద్ద లీడర్లు, చిలుకు జుబ్బాలు, సేతికి డేమెన్ ఉంగరాలు, బంగారం గొలుచుల్తో గడారాలు, అత్తా కోడలు పట్టుత్తరీయాలు. ఈ పంచాయతీదార్లే గదండీ కూంతెంత దొంగతనాలికి - సింతకాయలు కొట్టారని కూరమళ్ళలో పశువులు పడ్డాయని పెద్ద పెద్ద సబలు పెట్టించి పోలీసోల్లను పిలిపించింది? ఆ నాయం ఇప్పుడెక్కడయ్యా బాబులూ?"

ఆచార్లుగారు సంస్కృత శ్లోకం చదివి "పంచ యతు లున్నదే పంచాయతీ నాయనా! కలియుగంలో ఎక్కడ్నించి తెస్తున్నాం సర్వ సమత్వం చూడగలిగిన యతుల్ని?" అన్నారు.

వాళ్ళలో కుంకపుదాసు యగ్నెయ్య అందుకొని ''పంచ యతులు దొరకటం కష్టమే బాబూ! గ్రామ గ్రామంలో పంచ యముళ్ళయితే ఎతకనక్కర్లేదండీ!'' అని చమత్కరించాడు.

హరిజన వాడ పంచాయతీ సభ్యుడు రామజోగికి కోపం వచ్చింది. "గుర్రాన్నీ, గాడిదెల్నీ ఒక్క గాటన కట్టెయ్యమాకు యగ్నెయ్యా! భూముల ఇషయంలో మా తరుపున సాచ్చికం పలికినందుకే గదయ్యా లచ్చిన్నారాయణ బావ అని కూడా సూడకుండా మునసబుగోరికి కాపీలో ఇసం బెట్టింది? పోలీసోల్లకు అళ్ళంతా రిపోర్టు సేయకపోతే నిలబడిందీ రామజోగి నెంబరేనని మరిసి పోమాకయ్యా!''

ఒక్కొక్కరి మాటతో ఒక్కొక్క గ్రామ రాజకీయం బయటపడ్తున్నది. నేను వింటూ నించున్నాను. ముత్రాసు నారాయుడు ఒక్కసారిగా విజృంభించి నట్లు లేచి, ''ఏదాంతం ఇంటానికి రాలేదయ్యా మేమంతా. ఈ కూనీకోరు కామందులు, అల్ల ఎంగిలి తిని, గొడ్లకాడ కూడు తగలబెడ్తున్న ఈ దొంగెడ్డి రోళ్ళు- ఈల్ల పని గోయిందా'' అని జనాన్నుద్దేశించి అరవటం ప్రారంభించాడు.

ఆ దినం మాస శివరాత్రి. పెదనాన్నగారికి అభిషేకం సమయం మించి పోతున్నది. ఆయన ఒక కాలు కడప అవతల ఉంచి వెనుదిరిగి చూచారు. ఆ చూపు తీక్షణంగా ఉన్నట్లనిపించింది. ఆచార్లుగారి ముఖంలోకి సూటిగా చూస్తూ ఆకాశంలోకి వేలు చూపించారు. ''సర్వసాక్షి సూర్యభగవానులు అంతా విన్నాడు. మీరు జ్ఞానులు, వయోవృద్ధులు, ధర్మాధర్మ విచక్షణ తెలిసినవారు. ఈ గ్రామ

సభ ధర్మాధర్మాల్ని నిర్ణయించటం కూడా ఆ వేదమూర్తి కల్పనే. శిక్షించవలసింది మనం కాదు. దానికై ధర్మం ఉన్నది'' అంటూ జనం వంక తిరిగారు. ''పొద్దెక్కింది. పోయి మీ పనులు చూసుకోండి. వింటున్నారా- నారాయుడూ, రామజోగీ, టియ్యరూ?''

అందరూ ఒకరి ముఖాలు ఒకరు చూసుకుంటున్నారు. ''ఆదిత్య హృదయం పుణ్యం. సర్వ శత్రు వినాశనం. జయావహం జపే న్నిత్యం''అంటూ ఒజ్ఝలగారు లోపలికి పోతూన్న పెదనాన్నగారి బ్రాహ్మీమయ మూర్తికి నమస్కరించారు.

* * *

నేను తిరిగి కాలేజీలో చేరాను. కాని, పెదనాన్నగారి ప్రవర్తన భూస్వామ్యదుల రాజకీయాల కుళ్లు ముంపులో ఉన్న ఆ గ్రామం నా మనసును, హృదయాన్ని కలచివేస్తూనే ఉన్నవి. పెదనాన్నగారి వంటి సత్పురుషుల్ని రక్షించలేని ధర్మం ఎందుకు? ఆ దుష్ట వ్యవస్థలో కూడా న్యాయం కోసం తమ ప్రాణాల్ని ముందు బెట్టిన గ్రామ పేదల్ని నిరుత్సాహ పరచటం ఎంతవరకు సబబు? ఎవరి హృదయ పరివర్తనం కొరకు పెదనాన్నగారు వాళ్ళ విప్లవోత్సాహం మీద చలిగాలిని విసిరారు? లేక ఆయన కేవలం ఒక పిరికి మనుష్యుడా? గాంధీజీ కలలు గన్న గ్రామ స్వరాజ్యం ఈ తప్పుడు వ్యవస్థలో ఎట్లా ఉద్భవిస్తుంది? భూసంస్కరణలతోనా? ప్రపోర్షనల్ ఓటింగ్ పద్ధతితోనా? లేక వర్గ కలహాలతోనేనా? నా కర్థం కాలేదు.

నా మిత్రుడు, తోటి పొలిటికల్ సైన్స్ లెక్చరర్ రాజారావు అన్నాడు - "భూకామందులే రాజ్యాంగవేత్తలోయ్ బాబూ! వాళ్ళతోనే మీ విధాన సభలన్నీ నిండి ఉంటే ఇంకా భూ సంస్కరణలేమిటి? నన్నడుగుతావా? విను. ఈ అసంఖ్యాక గ్రామ పేదల విప్లవ శక్తిని సంఘటితం చేయగల శక్తి ప్రస్తుతం మనకు లేదు నాయనా! అది లెనిన్ వంటి మహా నాయకులకే సాధ్యం. ఈలోగా నంటావా? గ్రామ గ్రామానికి సినిమా కల్చరు పాకింది. ఆ గ్లామర్‌తో నీవు చెప్పిన యువక బృందమంతా పట్నాలకు చేరుకొంటూనే ఉంది. అంతా చివరకు గోవిందా. చికాకు పడకు. నీ పాఠాలు చెప్పుకో. వారానికి రెండు సినిమాలు చూడు. ఓపికుంటే ట్యూషన్ సంస్థ తెరు ఇంకా ధైర్యం ఉంటే చిట్‌ఫండ్ కంపెనీ

పెట్టు. మీ పెదనాన్నగారిని గురించి మాత్రం దిగులుపడకు" నేనైతే ఈ సారి అటు వెళ్ళి నా మనోశాంతిని పోగొట్టుకోదలచలేదు.

* * *

మానవుడి నిర్ణయాలకు విధి నిర్ణయం అడ్డుపడినట్లే ఆరు నెలల్లోనే మా మేనత్త కూతురు వివాహం పెదనాన్నగారింట్లోనే నిశ్చయమైంది. వేసవి సెలవులు. అమ్మ నేనువస్తే తప్ప వీలులేదన్నది. ఇకనేం - ఇంటిల్లిపాది తరలి వచ్చాం. బుట్టల నిండుగా మామిడిపళ్ళు మల్లెపూలు, నిమ్మరసం, మజ్జిగ. వేసవి పెళ్ళి అయినా దివ్యంగా జరిగిపోయింది. కాని, వారం రోజుల వరకూ మా తిరుగు ప్రయాణాన్ని బంధుసమూహం వాయిదా వేయిస్తూనే వచ్చింది. అమ్మ చెన్నకేశవుడి గుడిలో అర్చన చేయించింది. తిరిగి వస్తూండగా రామజోగి దారిలో కలిసి, గ్రామ రాజకీయాలు ఏకరువు పెట్టసాగాడు.

ఊరి బయట ఉన్న చెరువు నానుకొని ఏడెనిమిదెకరాల సర్కారు పోరంబోకు పొలం ఉండేది. దాన్ని కాజేయటానికి పెద్ద భూస్వాములు చేసిన ప్రయత్నాలు ఫలించేవేమో గాని, ఆ భూమి మధ్యగా మురుగు కాలవ తవ్వే ప్రాజెక్టు ఉండటంతో అప్పట్లో అవి కొనసాగలేదు. తదుపరి మురుగుకాలవ ఎలైన్‌మెంటు మారి పక్క గ్రామ సరిహద్దులోకి మారిపోవటంతో పెదనాన్నగారు పూనుకొని ఎన్నో ఆఫీసుల చుట్టూ తిరిగి ఆ భూమిని గ్రామపేదలపేర పట్టా లిప్పించారు. ఈ తతంగానికి దాదాపు అయిదేళ్ళు పట్టింది. పెదనాన్నగారు శ్రమకూ, ఖర్చుకూ వెనుదీయనందున లక్ష్మీనారాయణ దురాశ ఫలించలేదు. దాంతో కక్షలు పెరిగాయి. మునసబు లక్ష్మీనారాయణకు బంధువైనా, న్యాయం చెప్పి దొంగ వ్యాపారాల గుట్టు రట్టు చేయటంతో విషాహారానికి బలి అయిపోయాడు. ఇదీ చరిత్ర.

"ఈ కక్షలు ఇంతటితో సమసిపోయినట్లేనా?" అని నేను ప్రశ్నించాను.

"మా పల్లె మడుసులయితే - ఆడయితేనేం, మగయితేనేం పిల్లకాకి కూడా లచ్చిన్నారాయణ పన్లు మానేశామండీ!"

"మరి?"

"బైటూరి కూలోళ్ళను దార్జీలు బెట్టి తెచ్చుకుంటున్నాడు ఆళ్ళని మా పిల్లగాళ్ళు అటకాయిస్తుంటారు. ఆళ్ళదీ పొట్ట కక్కుర్తే గదండీ?"అని రామజోగి ముగించాడు.

ఈ అగ్ని చల్లారదన్న మాట! ఎప్పుడో ప్రచండమై మండిసీ, చెడునూ దహించక పోదన్న మాట! పూజ లందుకుంటున్న చెన్నకేశవ స్వామి దౌష్ట్యం, దుఃఖం కవల బిడ్డలవలె పారాడుతున్న ఈ లోకాన్ని తనిచ్చిన గీతా వాగ్దానంతో సముద్ధరించే దెప్పుడు? లేక రాజారావు చెప్పిన ఇంకో విప్లవ యుగకర్త ఈ దేశంలో ఉద్భవించే దెప్పుడు? సంజె చీకటిలో ఏకాకిగా నా సంవేదనలకు, ఆవేదనలకు ఆ మరుసటి దినమే నాకొక సమాధానం లభించింది.

*   *   *

సంధ్యావందనం ముగించుకొని సంజె చీకట్లు ముసురుకుంటుండగా పెదనాన్నగారు బయటి అరుగులమీదికి వచ్చేసరికి ముంగిట గుర్రబ్బండి నిలిచి ఉంది. ముత్రాసు నారాయుడి కొడుకూ, సువార్త మరిది ఏసూ కలిసీ ఈ బండి నడుపుతుంటారు. నారాయుడి కొడుకు పెద్దులు హడావిడిగా తలగుడ్డ సర్దుకుంటూ "బరితిపూడి కరణంగారి ఆవు సాలా పెమాదంలో ఉందండి - పాము కాటేమో! తవుర్ని ఉన్న పళాన జట్కాలో తెమ్మన్నారండి!" అంటున్నాడు.

"కరణంగారు మీకెక్కడ కనిపించారోయ్?"

''రైలుకట్ట రిపేరి పన్లకి ఎల్తున్నాంగదండి!"

పైఉత్తరీయం గూడా వేసుకోకుండానే పెదనాన్నగారు జట్కాబండిలో కూచొని "వస్తావా?" అని నా వంక చూశారు. భర్తిపూడి రైలుకట్ట ఆవలి గ్రామం. మహా ఉంటే క్రోసెడు దూరం.

''నేను పాంట్ వేసుకుని టార్చిలైటు తెస్తాలెండి. మీరు సాగిపోండి'' అని అంటుండగానే అఘమేఘాలమీద జట్కా కదిలిపోయింది. చీకటి కమ్ముతున్నది. కొరడా ఝుళుపులు చీకటిని కోస్తూ వినిపిస్తూండగా నేను లోపలికి పోయాను.

ఇంటి నందు మలుపు తిరిగి రోడ్డుమీదికి రావటానికి నాకు పది నిమిషాలు పట్టిందేమో- మసక చీకట్లో నా దారి కడ్డుగా నిలబడి జియ్యరు దాసు కనిపించి, నన్ను ఆగమన్నట్లుగా సైగ చేస్తున్నాడు.

''ఎవరు - దాసేనా?''

అతను గొంతు బాగా తగ్గించాడు.

"లచ్చినార్రాయణ కొడుకుని వాములదొడ్లో పాము కాటేసిందండి! తాను పామేసంట. నురగలు కక్కుతున్నాడు. మంచం మీన యేసి మీ ఇంటి కాడికి మోసుకొస్తున్నారయ్యా! అందుకే సంజీవయ్యగోర్ని జటకాలో పంపేశామయ్య. —మీరు కొంచెం తగ్గి నడవండి."

"మరి భత్రిపూడి కరణం గారి ఆవు?"

"ఆరికి అవేడదండీ? అమ్మేసి మొన్నటి ఏరివాక వున్నంకి సాలు పైచిలుకయిందండీ"

నేను నిర్ఘాంతపోయాను. ఏమనాలో తోచలేదు.

"ఇది.... ఇది.... మీరు చేసిన పని - మంచిది కాదనుకుంటాను. దాసూ! ఒక మనిషి ప్రాణం...."

"మేం చేసింది కాదయ్యగోరూ.అ పైనున్నోడు చేసింది. ఎటుమంటాళ్ళకు అటుమంటి పాయచ్చిత్తం."

అతని మాటలు పూర్తికాక ముందే రొప్పుతూ రోజుతూ మా ముందునుండే లక్ష్మినారాయణ పరుగులు తీస్తూ దాదాపు భత్రిపూడి డొంక మలుపు తిరగటం కనిపించింది. ఆ సంజెచీకట్లోనే అతను చేతులూపుతున్నాడు. ఉత్తరీయం ఊపుతున్నాడు.

"సంజీవరాయుడుగారూ.... నా కొడుకు, నా కొడుకు...." అతని కేకలు పతిధ్వనులు వింటూ నేను పరుగు పెట్టాను.

"నా కొడుకు- నా కొడుకు- మీరే రక్షించాలి."

ఆ చుట్టుపక్కల పాముకాట్లనుండి ఎంత మందికి ప్రాణదానం చేశారో అమ్మ చెప్పగా ఎన్ని కథలు విన్నానో!

జట్కాబండి ఆగినట్లుగా ఆగి, మళ్ళీ సాగుతున్నట్లుగా ఆ మసకలోనే నాకు ఊహగా కనిపించింది. నేను రెండుసార్లు టార్చివేశాను టార్చిలైటు కిరణాలు దూసుకుపోతూ బండిని తాకుతున్నవి. నేను బండిని సమీపించేసరికి ముత్రాసు యువకుడు పెదనాన్నగారితో ఆక్రోశంగా వాదిస్తున్నాడు. మధ్యలో ఎదురుదెబ్బ తగిలి లక్ష్మినారాయణ బోర్లాపడిపోయాడు.

''అవునండీ. మేం అబద్ధం చెప్పాం. ఆడి కది నిచ్చ. మా నోట మన్ను గొడితే మేం ఊరుకుంటామనుకున్నారయ్యా? మీ కుప్ప తగలబెట్టినప్పుడు ఆ ఈశ్వరుడు కనిపియ్యలా ఈనికి?''

''ఛీ - నోరు ముయ్యి. ఎక్కడిదిరా మీకీ మూర్ఖత్వం?" పెదనాన్నగారు అండి నుంచి దూకారు. నేను కళ్ళెంపట్టుకొని గుర్రాన్ని ఇంటివేపు మరల్చాను.

* * *

మేము వచ్చేసరికి పాము కాటేసిన యువకుడు అరుగుల మీద నురగలు కక్కుతూ, బరువుగా శ్వాసతీస్తూ అంతిమ దశలో ఉన్నట్లుగా పడి ఉన్నాడు. పెదనాన్నగారు చుట్టూ ఉన్న లాంతరు దీపాల్ని లక్ష్యపెట్టకుండా నా చేతిలో టార్చి అందుకున్నారు. ఒక క్షణం రోగిని పరిశీలించారు. ఇంతలోనే అమ్మ లోపల్నించి వచ్చి పెదనాన్నగారి మీద ఉత్తరీయం వేసింది. క్షణం ఆలోచించకుండా ఆయన ఉత్తరీయాన్ని ప్రదున చించుతూ అర్ధనిమిలిత నేత్రాలతో మంత్ర పఠనం చేస్తూ మధ్య మధ్య ఆ యువకుడి మీద నోటితో ఊదసాగారు.

ఆ దృశ్యం చూస్తుంటే నా అనుమానాలన్నీ పటాపంచలయినవి. గాలి కెగిరిపోయిన దూదిపంజల్లాగా పేపర్లలో చదివిన పాము కాటును గురించిన అర్థ సత్యాలన్నీ మటుమాయమయిపోయాయి.

పెదిమల చివర్లనుండి తోసుకొస్తున్న అతడి నురగ ఆగిపోయింది. తన ఉత్తరీయంతోనే పెదనాన్నగారు అతడి ముఖం తుడిచారు. అతని ఊర్ధ్వశ్వాస కుదుటబడ్డది. గాఢ నిద్రలో ఉన్న శిశువులాగా ఆ యువకుడు కన్పిస్తున్నాడు. అమ్మ రాగి పంచపాత్రలో నీళ్ళుతెచ్చి ఇవ్వగానే ఆయన ఆ జలాన్ని అతడి ముఖం మీద మంత్రయుక్తంగా చిలకరించారు. యువకుడు మెల్లమెల్లగా కళ్ళు తెరుస్తున్నాడు. నేను అప్పటికిగాని వెనుదిరిగి చూడలేకపోయాను. కరాలు జోడించి కన్నీరు కారుస్తున్న లక్ష్మీనారాయణ పెదనాన్నగారి పాదాలమీద పడి పోవటం కనిపించింది.

* * *

అమ్మ నాతో బయలుదేరి రాలేదు. జూలై నెలలో కాలేజీలు తెరవగానే రాజారావు కనిపించాడు.

"ఏమిటోయ్, నీ అనుమానం ఇంకా తీరలేదా? ఊరు వెళ్ళొచ్చావు గదా?" అని చనువుగా బుజం మీద చేయి వేశాడు.

''ఒకటి కాదు రెండు అనుమానాలు'' అన్నాను నేను.

''ఓహో! ఇంకో ప్లాబ్లెమా?''

''నువ్వు చెప్పు రాజారావ్! పాముకు విషమే లేదు, చచ్చినవాళ్ళు విషం వల్ల కాదు- షాక్‌తో ప్రాణం పోగొట్టుకుంటారు; మంత్రాలు, తంత్రాలన్నీ ట్రాష్ అని వ్రాస్తున్నారు గదా- ఎంతవరకు నిజం?''

రాజారావు ఏమీ ఆలోచనకు చోటివ్వకుండానే సమాధానం చెప్పాడు: ''నాన్సెన్స్! మా మేనమామ పాము కాటుతో చనిపోవటం నేను కళ్ళారా చూచాను. మా నాన్నగారు రైల్వే స్టేషన్ మాస్టరుగా రిటైరయినారుగదా? ఆయన అనుభవంలో పాముల నరసయ్యగారికి కనీసం నాలుగు సార్లయినా మెసేజెస్ ఇచ్చి మనుషుల్ని బతికించిన సంఘటనలు చెబుతుంటారు. ఎందుకొచ్చిందా అనుమానం?''

చెప్పాను. ఆ కిందటి రోజునే అమ్మ వ్రాసిన ఉత్తరం చూపించాను. "చదువు. చదివి గాంధీజీ ఈ కాలానికి రెలెవెంట్ అవునో, కాదో, కూడా చెప్పు" అని నిలదీశాను.

''అయితే, లక్ష్మీనారాయణ విలన్ మీ పెదనాన్నగారికి పది ఒండ్ల వడ్లు తోలించాడా? ఆయన హరిజనవాడలో మరీ పేదలకి పంచిపెట్టారా? బాగుంది. గాంధీజీ విషయంలో నా సమాధానం ఇది అవును- కాదు. మీ పెదనాన్నగారి వంటి తపోసంపన్నులతో ఆయన రెలెవెంటే. అణ్వాస్త్రాల విషయంలో గూడ ఆయన రెలెవెంటే. కాని, ఈ వ్యవస్థ కంతటికీ మాత్రం కాదు'' అన్నాడు.

నాకు రాచకీయ పరిజ్ఞానం చాలా తక్కువ. ఎక్కువ మాట్లాడటం అనుచితమని తోచింది. బహుశా రాజారావే రైటేమో!

*

(ఆంధ్రప్రభ వారపత్రిక - జనవరి 85)